# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023




**భర్త చేతిలో భార్య హతం**

భార్యను భర్త హత్య చేసిన ఘటన ఆత్మకూరు మండలంలోని ఆరవేడు గ్రామ గిరిజనకాలనీలో గురువారం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేశారు. 8లో



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.62,760 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,606 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.5,774 |
| నవర (8 గ్రా) | రూ.46,192 |




**వాతావరణం**

గురువారం గాలిలో 50 శాతం తేమ ఉంది. శుక్రవారం మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.








మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పొదలకూరు రోడ్డు ఇలా..



వేదాయపాలెంలో తలకు వస్త్రం చుట్టుకుని పనులకు వెళ్తున్నారిలా..



మండుటెండకు ఇలా తిరగాల్సిందే..



అతను కళ్లద్దాలతో.. ఆమె చున్నీ చుట్టుకుని..

## వామ్మో ఎండలు

జిల్లాలో కొద్దిరోజులుగా ఎండలు భయపెడుతున్నాయి. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. దీంతో మధ్యాహ్న వేళల్లో బయటికి వచ్చేందుకు జనం జంకుతున్న పరిస్థితులున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు భానుడి భగభగల కారణంగా నిర్మానుష్యంగా మారుతున్నాయి. పనుల నిమిత్తం రాకపోకలు సాగించేవారిలో అనేకమంది సెగ నుంచి తప్పించుకునేందుకు కళ్లద్దాలు వాడుతున్నారు. మహిళలు తలకు వస్త్రం చుట్టుకుంటున్నారు. గురువారం నెల్లూరులో తీసిన చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

# తల్లీబిడ్డ క్షేమం



- జీజీహెచ్‌లో గర్భిణులకు నాణ్యమైన వైద్యసేవలు
- రక్తహీనత ఉన్నవారికి సైతం సాధారణ కాన్పులు
- పెరుగుతున్న ప్రసవాల సంఖ్య
- ఒక్కోరోజు 15కి పైగా డెలివరీలు

గూడూరు పట్టణానికి చెందిన చాముండేశ్వరి నెలరోజుల క్రితం కాన్పు కోసం పెద్దాస్పత్రికి వచ్చింది. ఆమెకు అది మూడో కాన్పు. రక్త పరీక్ష చేయగా కామెర్లు ఉన్నట్లు తేలింది. రక్తంలో హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) సైతం 9 గ్రాముల్లోపు ఉంది. రిస్క్ అయినా డాక్టర్లు ఆమెకు భరోసా కల్పించి నార్మల్ కాన్పు చేశారు. ప్రొఫెసర్ గీతాలక్ష్మి దగ్గరుండి వైద్యసేవలందించారు.

అల్లూరుకు చెందిన వెంకట రమణమ్మ నెలరోజుల క్రితం కాన్పు కోసం జీజీహెచ్‌కు వచ్చింది. ఆమె పూర్తి రక్తహీనతతో పాలిపోయి ఉంది. ఇలాంటి స్థితిలో రక్తం ఎక్కించి కాన్పు చేశారు. ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఇలాంటివి పెద్దాస్పత్రిలో ప్రతినెలా చోటు చేసుకుంటున్నాయి.

ఒకప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు అనేకమంది భయపడేవారు. గర్భిణుల సంగతి అయితే చెప్పనక్కర్లేదు. సౌకర్యాలుండవని, వైద్యం సక్రమంగా చేయరని, అప్పు చేసి ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితులు మారాయి. గర్భిణులు కాన్పు కోసం ధైర్యంగా ప్రభుత్వాస్పత్రులకు వెళ్తున్నారు. నెల్లూరు జీజీహెచ్‌లో ప్రసవాల సంఖ్య పెరిగింది.

**నెల్లూరు(అర్బన్):** నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రసూతి విభాగంలో గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందుతోంది. రూ.లక్షలు ఖర్చయ్యే కేసుల్లో సైతం రూపాయి ఖర్చులేకుండా డెలివరీలు చేస్తున్నారు. ఆస్పత్రిలో కాన్పుల కోసం ఆధునిక వైద్య పరికరాలతోపాటు సీనియర్ గైనకాలజిస్టులు ఉన్నారు. రక్తహీనతకు సంబంధించిన కేసులు ఎక్కువగా వస్తున్నా అలాంటి వారికి సైతం సాధారణ డెలివరీలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పెద్దఎత్తున నిధులను విడుదల



పెద్దాస్పత్రిలోని ప్రసూతి విభాగం



బాలింతను పరీక్షిస్తున్న డాక్టర్లు

చేస్తోంది. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని నియమించింది. దీంతో అనేకమంది జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్యసేవలు పొందుతున్నారు. ప్రధానంగా గర్భిణుల్లో బీపీ, షుగర్ లాంటి జబ్బులున్న వారికి సైతం రిస్క్ తీసుకుని ఖర్చు లేకుండా డాక్టర్లు పురుడు పోస్తున్నారు.

**రక్తహీనత కేసులు**

కాగా రక్తహీనత ఉన్న మహిళలు జీజీహెచ్‌కు ఎక్కువగా వస్తున్నారు. సాధారణంగా రక్తంలో హెచ్‌బీ 12 నుంచి 15 గ్రాముల వరకు ఉండాలి. లేదా కనీసం 9 గ్రాములు పైబడి ఉన్నా కొంతమేరకు ఆరోగ్యంగా ఉన్నట్లే లెక్క. అయితే అనేకమందికి 9 గ్రాముల లోపు హెచ్‌బీ ఉంటోంది. ఇలా రక్తహీనత కలిగిన వారికి కాన్పు చేయాలంటే రిస్క్ ఎక్కువ. అయినా కూడా ప్రభుత్వ డాక్టర్లు వారికి భరోసా కల్పించి కాన్పులు చేస్తున్నారు. గత నాలుగు నెలలు గణాంకాలు పరిశీలిస్తే 3 గ్రాముల్లోపు హెచ్‌బీ ఉన్న వారు ఆరుగురు, అలాగే 3.5 గ్రాముల్లోపు ఉన్న ఐదుగురికి ఎంతో కష్టపడి కాన్పు చేశారు.

**నేడు ఇలా..**

గతంలో రోజుకు 5, 6 కేసుల కన్నా ఎక్కువ డెలివరీలు చేసే వారు కాదు. ఇప్పుడు డాక్టర్లను పూర్తి స్థాయిలో నియమించడంతో ఒక్కోరోజు 15కు పైగా కేసులు చూస్తున్నారు. బాలింతలకు అదనపు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. ఆహారంతో పాటు రోజూ అరటిపండు, పాలు, రెండు గుడ్లు, వేరుశనగ ముద్దలు ఇస్తున్నారు. ఫలితంగా వారు త్వరగా కోలుకుంటున్నారు.

**గతేడాది జరిగిన కాన్పులను పరిశీలిస్తే..**

| నెల | కాన్పుల సంఖ్య |
|---|---|
| జనవరి | 338 |
| ఫిబ్రవరి | 349 |
| మార్చి | 325 |
| ఏప్రిల్ | 437 |
| మే | 395 |
| జూన్ | 410 |
| జూలై | 359 |
| ఆగస్ట్ | 367 |
| సెప్టెంబర్ | 415 |
| అక్టోబర్ | 429 |
| నవంబర్ | 445 |
| డిసెంబర్ | 332 |

- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సుమారు 800పైనే కాన్పులు చేశారు.
- గతేడాది నవంబర్, డిసెంబర్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి 987 మంది హైరిస్క్ గర్భిణులకు సాధారణ కాన్పులు చేశారు.

**సద్వినియోగం చేసుకోండి**



పెద్దాస్పత్రికి ప్రభుత్వం అన్ని రకాల పరికరాలను అందజేసింది. ప్రధానంగా కాన్పుల విభాగంలో సరిపడినంత డాక్టర్లు, సిబ్బందిని నియమించి పరికరాలను సిద్ధం చేసింది. నాణ్యమైన మందులను అందుబాటులోకి తెచ్చింది. నైపుణ్యత గల సీనియర్ గైనకాలజిస్టులు ఆస్పత్రిలో సేవలందిస్తున్నారు. అందువల్ల గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి రూ.వేలు ఖర్చు చేసుకుని అప్పుల పాలు కాకుండా జీజీహెచ్‌కు వచ్చి ఉచిత వైద్యసేవలు పొందవచ్చు.

– డాక్టర్ సిద్దానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్

## నేడు కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు

**నెల్లూరు(వేదాయపాళెం):** భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఉదయం 10 గంటలకు నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన భవన్‌లో నిర్వహిస్తామని ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి, బీసీ సంక్షేమ సాధికారత అధికారి వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వీఆర్సీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వేడుకలు జరుగుతాయన్నారు. జిల్లా అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

## నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేస్తా

- కార్పొరేషన్ నూతన కమిషనర్ వికాస్ మర్మత్



మాట్లాడుతున్న వికాస్

**నెల్లూరు(బారకాసు):** ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలందరి సహకారంతో నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేషన్ నూతన కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారిగా పనిచేసిన అనుభవం ఉన్నట్లు చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయ పరిపాలన ఏ విధంగా ఉంటుంది?, అధికారులు, సిబ్బంది పనితీరు ఎలా ఉంది?, నెల్లూరు నగరంలో ఏమి సమస్యలున్నాయి? తదితర వాటి గురించి వారంపాటు అధ్యయనం చేస్తానన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటామన్నారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఎస్‌ఈ సంపత్‌కుమార్, అధికారులు, సిబ్బంది కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వికాస్ మేయర్ స్రవంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## న్యూస్‌రీల్

### సూక్ష్మసేద్యంతో నీరు వృథా కాదు

- మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు



రైతులతో మాట్లాడుతున్న పీడీ

**పొదలకూరు:** సూక్ష్మసేద్యం వల్ల నీరు వృథా కాదని, మొక్క మొదలుకు ప్రతి నీటిబొట్టు చేరుతుందని జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అయ్యగారిపాళెం గ్రామంలో రైతులు ఏర్పాటు చేసుకుంటున్న డ్రిప్ పైపులను గురువారం పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పొదలకూరు మండలంలో అధికంగా డ్రిప్ పైపులను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రైతులు సూచించిన కంపెనీల్లో వారికి నచ్చిన కంపెనీ పైపులను పెట్టుకునే వెసులుబాటు ఉందన్నారు. మండలంలో 328 మంది రైతులు 414.30 హెక్టార్లలో పైపులను బిగించుకున్నారని, 52 మంది 58.59 హెక్టార్లలో స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు.

### కేజీబీవీ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న మాధురి


**కలిగిరి:** కలిగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సమగ్రశిక్ష రాష్ట్ర ఏజీసీడీఓ మాధురి గురువారం పరిశీలించారు. విద్యాలయం పరిసర ప్రాంతాలు, తరగతి, వంట గదులు, స్టోర్‌రూంను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి వారు పరీక్షలు ఎలా రాస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీఓ ఉషారాణి, జీసీడీఓ మమత, ప్రిన్సిపల్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

### స్పెషల్ పీపీగా శైలజారెడ్డి



**నెల్లూరు(లీగల్):** నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు, సీనియర్ న్యాయవాది డి.శైలజారెడ్డిని నెల్లూరు 8వ అదనపు జిల్లా (పోక్సో) కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె మూడు సంవత్సరాలు ఈ బాధ్యతలను నిర్వహించనున్నారు. గతంలో అదనపు జిల్లా (ఫాస్ట్ ట్రాక్) కోర్టు స్పెషల్ పీపీగా పనిచేశారు. కాగా శైలజారెడ్డి నియామకంపై ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

### సోమశిలలో 52.695 టీఎంసీలు



**సోమశిల:** సోమశిల జలాశయంలో గురువారం నాటికి 52.695 టీఎంసీలున్నాయి. 370 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 50, ఉత్తరకాలువకు 400, దక్షిణకాలువకు 50, కండలేరు జలాశయానికి 300 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.792 మీటర్ల నీటి మట్టం ఉంది.

## సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మహిళలకు పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**పొదలకూరు:** సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సూరాయపాళెం గ్రామంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలను నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధిలోకి తీసుకొచ్చి ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరానికి దూరంగా మారుమూల ఉన్న సూరాయపాళెం గ్రామాన్ని కూడా నుడా పరిధిలోకి తెచ్చామని, ఇక్కడ పేదవారికి పక్కాఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం ఉండేదని, నేడు అర్హత ఉన్న ప్రతిఒక్కరూ సచివాలయాల ద్వారా పథకాలను పొందుతున్నారని చెప్పారు.

**రెండో పంటకు సాగునీరు**

జిల్లాలో రెండో పంటకు సాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని మంత్రి కాకాణి తెలిపారు. పాలకుడు మంచివాడైతే ప్రకృతి కూడా కరుణిస్తుందన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కంటే 20 శాతం అదనంగా రైతులకు అందుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో మినీ గోకులాలను నిర్మించుకున్న రైతులకు బిల్లులు చెల్లించలేదన్నారు. పేదలు ఉన్న పూరిళ్లను తొలగించుకుని పక్కాఇళ్లు నిర్మించుకుందామనుకుంటే టీడీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం పేదల ఇళ్లకు బిల్లులను అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, ఏఓ వాసు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ పేట వెంకయ్య, ఎంపీటీసీ సభ్యుడు పెంచలనాయుడు, మాజీ సర్పంచులు పులి సుబ్బారెడ్డి, ములుముడి మల్లారెడ్డి, నాయకులు దుద్దుగుంట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేమింతే.. మారమంతే

- నెల్లూరులోని వనంతోపు సెంటర్ ప్రాంతానికి చెందిన లక్ష్మి ఈనెల 3వ తేదీన వంట గ్యాస్ బుక్ చేశారు. 4న సిలిండర్ డెలివరీ చేశారు. సిలిండర్ ధర రూ.1,140కు అదనంగా రూ.50ను డెలివరీ బాయ్ వసూలు చేశాడు. ఆ ఇంటి యజమాని డెలివరీ ఉచితంగా కదా అని ప్రశ్నిస్తే మేము తీసుకుంటాం. లేకుంటే మీరే ఏజెన్సీ వద్దకు వెళ్లి సిలిండర్ తీసుకెళ్లాల్సి ఉంటుందని తెగేసి చెప్పాడు. • నెల్లూరులోని సత్యనారాయణపురానికి చెందిన ఓ మహిళ సిలిండర్ బుక్ చేశారు. రెండు రోజుల్లో డెలివరీ ఇచ్చిన బాయ్ ఆమె నుంచి అదనంగా రూ.50 వసూలు చేశాడు.

- గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అదనపు దందా
- రూ.50 చొప్పున లాగేస్తున్న వైనం
- రూ.కోట్లలో అక్రమ వసూళ్లు

**జిల్లాలో..**

| | |
|---|---|
| డొమెస్టిక్ కనెక్షన్స్ : | 4,63,622 |
| దీపం : | 2,21,936 |
| ఉజ్వల : | 24,307 |
| సీఎస్ఆర్ : | 96,369 |
| గ్యాస్ ఏజెన్సీస్ | |
| హెచ్‌పీ : | 14 |
| బీపీసీఎల్ : | 11 |
| ఐఓసీఎల్ : | 24 |

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** కేంద్ర ప్రభుత్వం తరచూ వంట గ్యాస్ ధర పెంచుతోంది. మరోవైపు డోర్ డెలివరీ సిబ్బంది కంపెనీలు నిర్ణయించిన ధరకు అదనంగా వసూలు చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో రూ.50 నుంచి రూ.60 వరకు వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సరాసరిన సిలిండర్‌పై రూ.50 చొప్పున లెక్కించినా రూ.కోట్లలో దోపిడీ జరుగుతోంది.

జిల్లా వ్యాప్తంగా రోజుకు 15 వేల సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు అంచనా. నెలకు 4.50 లక్షలకు పైగా వినియోగదారులకు అందజేస్తున్నారు. రవాణా మామూలు పేరుతో సిలిండర్‌కు రూ.50 చొప్పున నెలకు రూ.2.25 కోట్లు అక్రమంగా వసూలు చేస్తున్నారు. సిలిండర్లు అధికంగా మహిళలే తీసుకుంటారు. వారు రిస్క్ ఎందుకని డెలివరీ సిబ్బంది డబ్బు అడిగితే ఇస్తున్నారు. అధికంగా డబ్బు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే సిలిండర్లు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులు పెడతారని వినియోగదారులు భయపడుతున్నారు.

**ఇలా చేయాల్సి ఉన్నా..**

వాస్తవానికి ఐదు కిలోమీటర్ల లోపు వరకు సిలిండర్‌ను ఉచితంగా డెలివరీ చేయాలి. అలాగే 15 కి.మీ లోపు అయితే రూ.20 ఆపై రూ.30గా చార్జి నిర్ణయించారు. సిబ్బంది ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇష్టమైతే తీసుకోండి లేకుంటే గోదాము వద్దకు వెళ్లి పట్టుకెళ్లాలంటూ బెదిరిస్తున్నారు. సమీప గృహస్తులు గోదాము వద్దకు వెళ్లినా అక్కడ కూడా అదనంగా వసూలు చేయడం సహజంగా మారింది. జిల్లాలోని నెల్లూరుతోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో ఏజెన్సీలు రవాణా పేరుతో వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. వచ్చిన డబ్బులో సగభాగాన్ని సిబ్బంది ఏజెన్సీకి ఇవ్వాల్సి ఉంటుంది.




**నగదు వసూలు చేయకూడదు**

గ్యాస్ సిలిండర్ల రవాణాకు అదనంగా నగదు వసూలు చేయకూడదు. సిలిండర్లు ఉచితంగా రవాణా చేయాలి. రవాణా పేరుతో అక్రమంగా వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

## సైన్స్ క్లబ్‌కు జాతీయస్థాయి గుర్తింపు

**పొదలకూరు:** స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న సీవీ రామన్ సైన్స్ క్లబ్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. 2019లో విజ్ఞాన్ ప్రసార్ అనుమతితో సైన్స్ ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన వైజ్ఞానిక, సామాజిక కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని విజ్ఞాన్ ప్రసార్ వారు ఉత్తమ సైన్స్ క్లబ్ జాబితాలో చేర్చారు. ఈ మేరకు డీఈఓ గంగాభవాని చేతుల మీదుగా సుధాకర్ ప్రశంసాపత్రాన్ని గురువారం అందుకున్నారు. త్వరలో క్లబ్‌కు రూ.10 వేల విలువైన పుస్తకాలను అందజేయడం జరుగుతుందని సుధాకర్ వెల్లడించారు.



డీఈఓ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సుధాకర్

## క్లుప్తంగా

### పెద్దాస్పత్రిలో ఉచితంగా మోకాలి కీలు మార్పిడి



మాట్లాడుతున్న పెద్దాస్పత్రి వైద్యులు

నెల్లూరు (అర్బన్) : స్థానిక దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో నగరానికి చెందిన ఓ మహిళకు ఉచితంగా మోకాలి కీలు (నీ రిప్లేస్‌మెంట్) మార్పిడి సర్జరీని విజయవంతంగా చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌నాయుడు వివరించారు. నగరానికి చెందిన 55 ఏళ్ల మహిళ మోకాళ్ల నొప్పితో ఆపరేషన్ కోసం ఆమె తిరుపతికి వెళ్లగా అక్కడి వైద్యుల సలహాలతో నెల్లూరు పెద్దాస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి గురువారం ఆపరేషన్‌ను పూర్తి చేశారు. దీనికి ప్రైవేటు ఆస్పత్రిలో దాదాపు రూ.2.05 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చయ్యేదని వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌లో పాల్గొన్న అసోసియేషన్ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు దీప్తి, భాస్కర్, ముత్తు, వైద్యులు జమున, శాంతిశ్రీ, శారద, నర్సింగ్ సిబ్బంది రాధా, శివాని బృందాన్ని సూపరింటెండెంట్ అభినందించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

### నెలాఖరు వరకు అక్రిడిటేషన్ కొనసాగింపు

నెల్లూరు (అర్బన్) : జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇప్పటి వరకు ఉన్న అక్రిడిటేషన్‌ను ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ కమిటీ ఆమోదం తెలిపిందని జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి సదారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్ స్లిప్‌ల కోసం కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



# సహనానికి పరీక్ష పెట్టొద్దు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నాపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని.. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేస్తున్నా ఓపిగ్గా ఉన్నానని.. తన సహనానికి పరీక్ష పెట్టొద్దని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 53వ డివిజన్లో ఉన్న గాంధీ గిరిజన కాలనీ, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగర నియోజకవర్గంలో లేఅవుట్లు మొత్తం 40 ఎకరాలకు మించి ఉండవని, ఆమోదించని లేఅవుట్లు 10 నుంచి 20 ఎకరాల కంటే ఉండవన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఎకరాల్లో లేఅవుట్లను అక్రమంగా వేశారని ఆరోపించారు. జిల్లాలో అతి తక్కువ సంఖ్యలో లేఅవుట్లు వేసే పరిస్థితి నగర నియోజకవర్గంలోనే ఉందని చెప్పారు. జిల్లాలో ఏమి జరిగినా తనపై నిందలు మోపడం.. ఎవరో లేఅవుట్లు వేస్తే అందులో తనకేదో భాగం ఉందంటూ ప్రచారం చేయడం పచ్చ మీడియాకు అలవాటైపోయిందని మండిపడ్డారు. సదరు లేఅవుట్లకు సంబంధించి ఎవరెవరికి ముడుపులు అందాయో రాసే దమ్ముందానని ప్రశ్నించారు. కార్పొరేటర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సైన్స్ సిస్టం ప్రారంభం



సిస్టంను ప్రారంభిస్తున్న డీటీసీ చందర్

నెల్లూరు (టౌన్) : జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని ఎల్ఎల్ఆర్ రూమ్‌లో రోడ్డు సైన్స్ డిస్‌ప్లే సిస్టంను ఉప రవాణా కమిషనర్ బి.చందర్ గురువారం ప్రారంభించారు. లైసెన్స్ కోసం వచ్చిన వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు దాతల సహకారంతో ఈ సిస్టంను ఏర్పాటు చేశారు. దీని ద్వారా లైసెన్స్ కోసం వచ్చే వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌పై కంప్యూటర్‌లో కొన్ని ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. దీంతో పాటు ప్రమాదాలకు గల కారణాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర వాటిని సిస్టంలో డిస్‌ప్లే చేయనున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్, రాంబాబు, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, ఏఓ కిశోర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, గ్రామాల సుస్థిర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణ పరిధిలోని పాతూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యే స్వస్థలం పాతూరు కావడంతో స్థానికంగా ప్రతిఒక్కరూ ఎమ్మెల్యేకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. స్థానికులు కూడా గడప గడపకు తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని పరిష్కారంపై ఆయాశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పాలనలో పూర్తి పారదర్శకత తీసుకొచ్చి పేదలందరికీ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్య తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఒక్కో సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు కేటాయిస్తే, ప్రత్యేక విజ్ఞప్తి మేరకు కావలిలో మాత్రం ఒక్కో సచివాలయ పరిధిలో ముఖ్యమంత్రి రూ.40 లక్షల వంతున మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న మూడు నెలల్లో ఈ నిధులతో పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు జనిగర్ల మహేంద్రయాదవ్, పానుగోటి అనూరాధ, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవకు పట్టం

నెల్లూరు(క్రైమ్) : రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తోన్న పోలీసు, అగ్నిమాపక, విజిలెన్స్, ఇంటిలిజెన్స్ విభాగాల అధికారులు, సిబ్బందికి సేవా పతకాలను గురువారం ప్రకటించింది. జిల్లాలో హోమ్‌గార్డ్స్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీనివాసులు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

**పతకాలు వీరికే..**

ఉత్తమ సేవలకు గానూ కె.శ్రీనివాసులు(కందుకూరు డీఎస్పీ), షేక్.సర్దార్ అహ్మద్ (ఏఆర్ ఎస్సై), సీహెచ్ శ్రీనివాసరావు (ఏఆర్ ఎస్సై), యు.కొండలరావు, ఎస్.రామిరెడ్డి (నార్త్ ట్రాఫిక్ హెచ్‌సీ), పి.మధుసూదనరావు (హెచ్‌సీ ఆత్మకూరు), పి.బాలాజీ గురుప్రసాద్ (లీడింగ్ ఫైర్‌మెన్, నెల్లూరు), ఎస్.బాబ్జి బాలచంద్రరావు (హెచ్‌సీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలకు ఎంపికైన అధికారులు, సిబ్బందిని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి అభినందించారు.

### కానిస్టేబుల్‌గా చేరి..



పి.శ్రీనివాసులు

నెల్లూరు పొదలకూరు రోడ్డు లక్ష్మీనరసింహపురానికి చెందిన పి.శ్రీనివాసులు 1998లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన డీఎస్‌బీ(డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్)లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2013లో ఆయన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా పతకం అందుకున్నారు. ఈ ఏడాది ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు.

### ఆర్ఎస్ఐ నుంచి హోమ్‌గార్డ్స్ డీఎస్పీ స్థాయికి..



ఎస్.చంద్రమోహన్

జిల్లాలోని విడవలూరు మండలానికి చెందిన ఎస్.చంద్రమోహన్ 1992లో ఆర్ఎస్ఐగా పోలీసుశాఖలో బాధ్యతలు చేపట్టారు. 2008లో ఆర్ఐగా పదోన్నతి పొందారు. విశాఖ రూరల్, ఒంగోలు, నెల్లూరు, విజయవాడ కమిషనరేట్‌లో ఆర్ఐగా పనిచేశారు. గతేడాది డీఎస్పీగా పదోన్నతి పొంది నెల్లూరు హోమ్‌గార్డ్స్ డీఎస్పీగా నియమితులయ్యారు. ఉత్తమ సేవలకు గానూ 2017లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా పతకం అందుకున్నారు. తాజాగా ఉత్తమ సేవా పతకం ఆయన్ను వరించింది.

## కృష్ణచైతన్యలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నెల్లూరు (టౌన్) : నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మేది అసిస్టెంట్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ తదితర కంపెనీలు జరిపిన ప్రాంగణ ఎంపికల్లో మొత్తం 51 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తెలిపారు. రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛంతో అభినందించింది. కార్యక్రమంలో డీన్ సుధారాణి, అడ్మిన్ డీన్ రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య, ప్లేస్‌మెంట్ అధికారి భానుచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## భర్త చేతిలో భార్య హతం

ఆత్మకూరు : కట్టుకున్న భర్త చేతిలో భార్య హతమైన ఘటన మండలంలోని ఆరవేడు గ్రామ గిరిజనకాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఆత్మకూరు ఇన్‌చార్జి సీఐ రవినాయక్, ఎస్సై ఎం.శివశంకర్‌రావు వివరాల మేరకు.. ఆరవేడు గ్రామానికి చెందిన చల్లా మధు బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అదే ప్రాంతానికి చెందిన లక్ష్మీదేవి(28) భర్త నుంచి విడిపోయి ఓ కుమార్తెతో కలిసి ఉంటోంది. కాగా లక్ష్మితో మధుకు ఏర్పడిన పరిచయం వివాహానికి దారి తీసింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో బేల్దారి పనుల కోసం మధు రాజంపేటకు వెళ్లాడు. నెలరోజుల తరువాత గురువారం గ్రామానికి వచ్చాడు. భార్యపై అనుమానంతో గొడవకు దిగాడు. దీంతో ఆమెను గొంతు నులిమి చంపి పరారయ్యాడు. సమీపంలో ఉన్న వారు పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మీదేవి మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## గుర్తుతెలియని మృతదేహానికి పోస్టుమార్టం



మృతదేహాన్ని వెలికితీయిస్తున్న కావలి డీఎస్పీ, సీఐ, ఎస్సై

జలదంకి : మండలంలోని కుమ్మరకొండూరు వాగు వద్ద ఉలసబాడ ప్రాంతంలో పూడ్చిన స్థితిలో గుర్తించిన మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. ముందుగా కావలి డీఎస్పీ వెంకటరమణ, కలిగిరి సీఐ సాంబశివరావు, జలదంకి ఎస్సై వీరేంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నెల్లూరు నుంచి ఫోరెన్సిక్ నిపుణులను రప్పించారు. వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని ఇసుక నుంచి వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం కుడిచేతిపై మల్లికార్జున పేరు పచ్చబొట్టు ఉంది. 35 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు ఉంటుందని, ఎక్కడా దెబ్బలు లేవని ఫోరెన్సిక్ నిపుణులు తెలిపారు. అనంతరం ఎస్సై వీరేంద్రబాబు మాట్లాడుతూ ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చిన తరువాత పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామని తెలిపారు.

### పొదలకూరు నిమ్మధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.75 |
| సన్నవి | : రూ.50 |
| పండ్లు | : రూ.30 |



### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 118 |
| లేయర్ (లైవ్) | : 75 |
| బ్రాయిలర్ చికెన్ | : 208 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 230 |
| లేయర్ చికెన్ | : 128 |

